‘తెలంగాణలో బీసీలకు అన్యాయం’


మాట్లాడుతున్న సుభాష్‌చందర్జీ

సైదాబాద్: రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి వర్ణించినట్లు ఫిబ్రవరి 4న సామాజిక న్యాయ దినం కాదని, ఆరోజు బీసీ వర్గాల వ్యతిరేక దినమని జీహెచ్‌ఎంసీ మాజీ డిప్యూటీ మేయర్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జి.సుభాష్‌చందర్జీ అన్నారు. బుధవారం సైదాబాద్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. తెలంగాణలో బీసీలకు రాష్ట్ర ప్రభుత్వం అన్యాయం చేస్తుందని ఆరోపించారు. బీసీల జనాభాను ఎందుకు తక్కువ చేసి చూపిస్తున్నారో సీఎం సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో బీసీ జనాభా 55 శాతం ఉండగా కాంగ్రెస్ ప్రభుత్వం 13 శాతం తక్కువ చేసి చూపిస్తూ తెలంగాణలో బీసీలు 42 శాతం మాత్రమే అని ప్రకటించడం అన్యాయమన్నారు. మత ప్రాతిపదికన రిజర్వేషన్లు ఉండవని సర్వోన్నత న్యాయస్థానం ఎప్పుడో తేటతెల్లం చేసినా ప్రభుత్వ ప్రకటనలో హిందూ బీసీలు, ముస్లిం బీసీలు అని ప్రకటించడం ఎంత వరకు సమంజసమని ప్రశ్నించారు. గతంలో 9 శాతంగా ఉన్న ఓసీలు ఒక్కసారిగా 15.5 శాతమని చూపడం కులగణన ఎంత తప్పుల తడకగా నిర్వహించారో అర్థమవుతుందన్నారు.

వర్గీకరణపై మాట నిలబెట్టుకున్న ఘనత రేవంత్‌రెడ్డిదే..


సీఎం చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న నాయకులు

మలక్‌పేట: ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల కాంగ్రెస్ ఎస్సీ విభాగం నాయకులు హర్షం వ్యక్తం చేశారు. పార్టీ నేతలు ధర్మేందర్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో బుధవారం మూసారంబాగ్ చౌరస్తాలోని డా.అంబేద్కర్, మూసీనది వద్దనున్న బాబూ జగ్జీవన్‌రామ్ విగ్రహాలకు పూలమాలలు వేసి సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ విభాగం రాష్ట్ర కన్వీనర్ బోనగిరి చంద్రశేఖర్ మాట్లాడుతూ.. వర్గీకరణపై ఇచ్చిన మాట నిలబెట్టుకున్న ఘనత రేవంత్‌రెడ్డికే దక్కిందన్నారు. న్యాయసమ్మతమైన వర్గీకరణ పోరాటంతో అందరికి మేలు జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో శ్యామ్‌రావు, ధన్వంత్, బాబు శ్రీనివాస్, మొండి శ్రీను, సుదర్శన్, సాయికిషోర్, అశ్వక్‌ఖాన్, వెంకటస్వామి పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలి


స్వచ్ఛ రిక్షాలను ప్రారంభిస్తున్న శ్వేతామధుకర్‌రెడ్డి

సైదాబాద్: విధి నిర్వహణలో పారిశుద్ధ్య కార్మికులు అప్రమత్తంగా ఉండాలని ఐఎస్‌సదన్ డివిజన్ కార్పొరేటర్ జంగం శ్వేతామధుకర్‌రెడ్డి సూచించారు. బుధవారం ఐఎస్‌సదన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో పారిశుద్ధ్య కార్మికులకు నూతన స్వచ్ఛ రిక్షాలను పంపిణీ చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ.. పారిశుద్ధ్య కార్మికులు చెత్త సేకరణ, తరలింపులను ఎప్పటికప్పుడు చేపట్టాలన్నారు. కాలనీలు, బస్తీలవాసులు కార్మికులకు సహకరించాలని కోరారు. పరిసరాల పరిశుభ్రత అందరు బాధ్యతగా భావించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో శానిటేషన్ ఎస్ఎస్ ఫక్రుద్దీన్, అర్జున్ నాయక్, జవాన్ కృష్ణ, రాము, రాజ్‌కుమార్, గోపాల్, సత్యనారాయణ, అశోక్ పాల్గొన్నారు.

ప్రధాని చిత్రపటానికి పాలాభిషేకం


ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేస్తున్న బీజేపీ నాయకులు

చాదర్‌ఘాట్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బడ్జెట్ అన్ని వర్గాలకు ప్రయోజకరంగా ఉందని ఓల్డ్‌మలక్‌పేట డివిజన్ బీజేపీ అధ్యక్షుడు సతీష్‌సింగ్ పేర్కొన్నారు. బుధవారం ఆయన ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మోదీ చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా సతీష్‌సింగ్ మాట్లాడుతూ.. కేంద్రం ప్రవేశ పెట్టిన బడ్జెట్ దేశ స్థితిగతిని మారుస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో కోటేశ్వరరావు, చౌకి రాజు, చీపురు రాజు, రాజు ముదిరాజ్ పాల్గొన్నారు.

ప్రజలను అయోమయానికి గురిచేస్తున్న కేఎల్లార్

- బీజేపీ మండల అధ్యక్షుడు యాదిశ్

మహేశ్వరం: మహేశ్వరం నియోజకవర్గంపై మాజీ ఎమ్మెల్యే కేఎల్లార్‌కు ఏమాత్రం అవగాహన లేకుండా మాట్లాడి ప్రజలను అయోమయానికి గురిచేస్తున్నారని బీజేపీ మండల అధ్యక్షుడు టి. యాదిశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఆయన మాట్లాడుతూ.. మాజీ ఎమ్మెల్యే, మహేశ్వరం కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్‌చార్జి కేఎల్లార్‌కు మహేశ్వరం నియోజకవర్గంపై ఏమాత్రం అవగాహన లేదని, ఆయన నోటికి వచ్చినట్లు హామీలు ఇచ్చి ప్రజలను అయోమయానికి గురి చేస్తున్నారన్నారు. మహేశ్వరం మండలం మున్సిపాలిటీ అవుతుందని ఉచిత హామీలిచ్చి అది కాకుండా చేశారు. ఇటీవల మహేశ్వరం, కందుకూరు, యాచారం, ఇబ్రాహీంపట్నం మండలాలు కలిసి ఫోర్త్ సిటీ ప్రత్యేక కార్పొరేషన్ అవుతుందని పలుమార్లు ప్రజలకు చెప్పి అయోమయానికి గురి చేసి ఇప్పుడు కార్పొరేషన్ కావడం లేదు, గ్రామ పంచాయతీలు గానే ఉంటాయని అంటున్నారన్నారు. ప్రతిసారి ప్రజలకు అమలుకానీ హామీలిచ్చి వాటిని అమలు చేయకుండా, కార్యరూపం దాల్చకుండానే ఉంటున్నాయన్నారు. పంచాయతీ ఎన్నికలకు ముందు సర్పంచ్‌ల పెండింగ్ బిల్లులను విడుదల చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమలుకానీ హామీలిచ్చి వాటిని అమలు చేయకపోవడంతో ప్రజలు గ్రామా ల్లో కాంగ్రెస్ నాయకులపై తిరగబడుతున్నారన్నారు. త్వరలో గ్రామాల్లో కాంగ్రెస్ పార్టీకి ప్రజలు బుద్ధి చెబుతారన్నారు.

వర్గీకరణ కాంగ్రెస్‌తోనే సాధ్యమైంది

పార్టీ ఎస్సీ సెల్ రాష్ట్ర కన్వీనర్ నర్సింహా



మహేశ్వరం: ఎస్సీ వర్గీకణ అమలు కాంగ్రెస్‌తోనే సాధ్యమైందని రాష్ట్ర ఎస్సీ సెల్ కన్వీనర్ నందిగామ నర్సింహ పేర్కొన్నారు. బుధవారం మండల కేంద్రంలో ఎస్సీ వర్గీకరణ అమలుపై కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో దళిత, బీసీ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఎస్సీ వర్గీకరణతో 30 ఏళ్ల కల సంపూర్ణంగా సాకారం కాబోతుందన్నారు. సామాజిక న్యాయానికి కాంగ్రెస్ కట్టుబడుతుందన్నారు. బీసీల కులగణన చేసి ఎవరి వాటా ఎంతో తేల్చి వారికి రిజర్వేషన్లు ఇవ్వనుందన్నారు. రిజర్వేషన్లు అమల్లోకి వచ్చి ఇన్నేళ్లయినా కొన్ని వర్గాల్లో ఇంకా అసమానతలు కొనసాగుతున్నాయన్నారు. ఎస్సీ వర్గీకరణ అమలు చేస్తున్న సీఎం రేవంత్‌రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. అంతకుముందు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల మాజీ అధ్యక్షుడు కాకి ఈశ్వర్, మండల యూత్ అధ్యక్షుడు గొల్లూరు రాజు, శివగంగ ఆలయ కమిటీ చైర్మన్ అల్లె కుమార్, సీనియర్ నాయకులు చాకలి యాదయ్య, ఆవుల యాదయ్య, అదిల్, లాజర్, శ్రీశైలం, గణేశ్, శ్రీకాంత్, శివ, ప్రవీణ్, పరమేశ్, కుమార్‌యాదవ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వానికి పేరు వస్తుందని అక్కసుతోనే వాకౌట్

హుడాకాంప్లెక్స్: ఎస్సీ వర్గీకరణకు రాష్ట్ర ప్రభుత్వం సై అన్న నేపథ్యంలో బీఆర్‌ఎస్ మద్దతు ఇస్తుందా లేదా తెలపకుండా కాంగ్రెస్ ప్రభుత్వానికి మంచి పేరు వస్తుందన్న అక్కసుతో వాకౌట్ చేయడం దురదృష్టకరమని జిల్లా కాంగ్రెస్ పార్టీ ప్రధాన కార్యదర్శి వక్కలంక శ్రీనివాసరావు విమర్శించారు. బుధవారం సరూర్‌నగర్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజలు బాగుపడడం ఇష్టం లేకే శాసనసభను బీఆర్‌ఎస్ బహిష్కరించిందని ఆరోపించారు. వర్గీకరణతో పాటు కీలకమైన బీసీ కులగణనపై చర్చ జరుగుతుంటే, శాసనసభకు రండీ అని ముఖ్యమంత్రి చెప్పినా కేసీఆర్ రాలేదన్నారు. ఇచ్చిన మాట ప్రకారం సోనియాగాంధీ, రాహుల్‌గాంధీ కులగణన చేయడమే కాక ఎస్సీ వర్గీకరణకు కూడా స్వాగతం చెప్పిందని తెలిపారు. సమావేశంలో హుజూరాబాద్ మాజీ యువజన కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి విష్ణుదాస్ వంశీ పాల్గొన్నారు.

54 ఏళ్లుగా అద్దె భవనాల్లోనే..

- ఆధునీకరణకు నోచుకోని సైదాబాద్ గ్రంథాలయం
- అరకొర వసతులు, ఇరుకు గదులతో ఇక్కట్లు
- సౌకర్యాలు కల్పించాలని పాఠకుల విజ్ఞప్తి



సైదాబాద్ కాలనీలోని గ్రంథాలయం

సైదాబాద్: అధునాతన సాంకేతిక పరిజ్ఞానం ఎన్ని కొత్త పుంతలు తొక్కినా.. అరచేతిలో ఇమిడే సెల్‌ఫోన్‌లోనే ప్రపంచ సమాచారం అందుతున్నా.. ఎప్పటికీ తరగని విజ్ఞానాన్ని అందిస్తూ పాఠకుల విశేష ఆదరణ పొందున్నాయి గ్రంథాలయాలు. టీవీలో పదుల సంఖ్యలో వార్తా ఛానళ్లు ఉన్నా, సోషల్ మీడియాలో ఎన్నో సమాచారాలు అందుతున్నా ఇప్పటికీ నిత్యం ఉదయం, సాయంత్రం సమీపంలోని గ్రంథాలయాలకు వెళ్లే వారు పెద్ద సంఖ్యలోనే ఉంటారు. అయితే మారుతున్న కాలం, పరిస్థితులను అనుసరించి గ్రంథాలయాలను సైతం ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. సైదాబాద్ శాఖ గ్రంథాలయం సైతం దశాబ్దాలుగా ఎలాంటి మార్పులు లేక, సరైన వసతులు లేక పాఠకులు, సిబ్బంది ఇబ్బందులు పడుతున్నారు.

20 వేల పుస్తకాలు..

సైదాబాద్ శాఖ గ్రంథాలయం 1970 నవంబర్ 11న ఏర్పాటైంది. అప్పటి నుంచి 52 ఏళ్లు సైదాబాద్ కాలనీలోని ఒకే భవనంలో కొనసాగింది. రెండేళ్ల క్రితం అదే కాలనీలోని మరో ప్రస్తుత భవనంలోకి మార్చారు. హైదరాబాద్ నగర గ్రంథాలయ సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఈ లైబ్రరీకి పాఠకుల ఆదరణ కూడా ఉంటుంది. నిత్యం పదుల సంఖ్యలో ఈ గ్రంథాలయానికి ఉదయం 8 గంటల నుంచి 11 వరకు, సాయంత్రం 4 గంటల నుంచి రాత్రి 7 గంటల వరకు పాఠకులు వస్తుంటారు. నిత్యం వచ్చే దినపత్రికలతో పాటు తెలుగు, ఆంగ్లం, హిందీ, ఉర్దూ, తమిళం, మరాఠీ, సంస్కృతం సుమారు 20 వేల పుస్తకాలు అందుబాటులో ఉన్నాయి.

సిబ్బందికి తప్పని తిప్పలు..

గ్రంథాలయం ఉన్న ప్రస్తుత అద్దె భవనంలో పాఠకులు కూర్చొనే గదులు ఇరుకుగా ఉండటంతో ఇబ్బందులు పడుతున్నారు. లైబ్రరీలోని పుస్తకాలు ప్రదర్శనగా ఉంచటానికి, భద్రపర్చడానికి సరైన స్థలం లేక సిబ్బంది సైతం ఇక్కట్లు పడుతున్నారు. ఒకే సమయంలో ఎక్కువ మంది వస్తే కొందరు నిల్చునే పుస్తకాలు, దినపత్రికలు చదవాల్సి వస్తుంది. నిరుద్యోగులకు పోటీ పరీక్షలకు ఉపయోగపడే పుస్తకాలు అందుబాటులో ఉంచాలని కోరుతున్నారు.

ఆధునీకరిస్తే మరింత ఆదరణ..

నేటి యువతకు నచ్చేలా గ్రంథాలయాన్ని ఆధునీకరించాల్సిన అవసరం ఎంతైనా ఉంది. నగరంలోని ఎన్నో లైబ్రరీలను సంస్థ ఆధ్వర్యంలో డిజిటలైజేషన్ చేశారు. అదే విధంగా సైదాబాద్ శాఖ గ్రంథాలయాన్ని సైతం డిజిటలైజేషన్ చేస్తే పాఠకుల నుంచి మరింత ఆదరణ లభిస్తుంది. నేటి విద్యార్థులు, నిరుద్యోగ యువత డిజిటలైజ్డ్ విధానంలో పఠనానికి ఎక్కువ ఆసక్తి చూపించడం కూడా అందుకు ఒక కారణం. ఇప్పటికైనా సంస్థ ఉన్నతాధికారులు స్పందించి సైదాబాద్ గ్రంథాలయానికి శాశ్వత భవనం, లైబ్రరీని డిజిటలైజేషన్‌లో అందించాలని పాఠకులు కోరుతున్నారు.

ప్రస్తుత భవనాన్ని ఉచితంగా కేటాయించాలి



కాలనీలో గ్రంథాలయం ఏర్పాటుకు భవనం దొరకడం కష్టంగా ఉంది. ప్రస్తుతం ఉన్న భవనాన్ని యజమాని టీటీడీకి దానంగా సమర్పించారు. ప్రస్తుతం రూ. 8500 అద్దె చెల్లిస్తున్నాం. ఈ భవనాన్ని గ్రంథాలయానికి ఉచితంగా కేటాయించాలని టీటీడీని అభ్యర్థించాం. ఇక్కడ కొన్ని ఇబ్బందులు ఉన్నాయి. అయితే పాఠకులకు సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకుంటున్నాం. పోటీ పరీక్షల కోసం అవసరమైన పుస్తకాలను అందుబాటులో ఉంచుతున్నాం.

–గరం హరిశంకర్, ఇన్‌చార్జి లైబ్రేరియన్

ఆధునీకరిస్తే అందరికీ ఉపయోగం



సైదాబాద్ శాఖ గ్రంథాలయాన్ని డిజిటలైజేషన్ చేసి ఆధునీకరిస్తే అందరికీ ఉపయోగంగా ఉంటుంది. కంప్యూటర్ల ఏర్పాటు, ఇంటర్నెట్ సౌకర్యాలు కల్పిస్తే యువతకు మరింత లబ్ధి చేకూరుతుంది. అన్ని రకాల పుస్తకాలతో పాటు తెలంగాణ ఉద్యమం, ఉద్యమకారుల జీవిత చరిత్ర, తాజా సమాచారాలు అందించే పుస్తకాలను అందుబాటులో ఉంచితే పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే వారిక ఉపయుక్తంగా ఉంటుంది.

–లక్ష్మణ్ ఠాకూర్ సైదాబాద్ బీఆర్‌ఎస్ ప్రధాన కార్యదర్శి

బీసీలపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఊరుకోం

హస్తినాపురం: బీసీ కులస్తులపై అనుచిత వ్యాఖ్యలు చేస్తే సహించేది లేదని అలాంటి వారిపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని బీసీ రిజర్వేషన్ పోరాట సమితి అధ్యక్షులు కోట్ల వాసుదేవ్, గిరిజన సంక్షేమ సంఘం కార్య నిర్వాహక అధ్యక్షుడు బాబురామ్ నాయక్ డిమాండ్ చేశారు. బీసీలను కించపరిచేలా వ్యాఖ్యలు చేసిన మహేశ్‌రెడ్డి, మల్లారెడ్డిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వనస్థలిపురం ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్‌కు వినతి పత్రం అందజేశారు.

ప్రత్యేక పూజలు

దిల్‌సుఖ్‌నగర్: ఆర్‌కేపురం డివిజన్ అష్టలక్ష్మి దేవాలయంలో రథసప్తమి, భీష్మాష్టమి సందర్భంగా బుధవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా అష్టలక్ష్మి సమేత శ్రీమన్నారాయణ స్వామి, శ్రీఅష్టలక్ష్మీ అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారిని వాహన సేవపై పురవీధులలో ఊరేగించారు. దేవాలయ చైర్మన్ సోమా సురేష్‌కుమార్, ప్రధాన కార్యదర్శి గంప జగన్, మాజీ చైర్మన్ బంధం దామోదర్ గుప్తా, మేడం సుధాకర్‌గుప్తా, వైస్ చైర్మన్ నాగమల్లు శ్రవణ్‌కుమార్ పాల్గొన్నారు.

ఎల్‌ఆర్‌ఎస్ పద్ధతి అమలు చేయొద్దు

చైతన్యపురి: ఎల్‌ఆర్‌ఎస్ పద్ధతి అమలు చేయకుండా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చర్యలు తీసుకోవాలని బంగారు తెలంగాణ మార్కెటింగ్ అసోసియేషన్ గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు ప్రభాకర్‌రెడ్డి అన్నారు. దిల్‌సుఖ్‌నగర్‌లో జరిగిన అసోసియేషన్ సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. పేదలు రూపాయి రూపాయి కూడబెట్టుకుని స్థలం కొనుగోలు చేస్తే ఎల్‌ఆర్‌ఎస్ పేరుతో మళ్లీ డబ్బులు తీసుకోవడం సరికాదన్నారు. ఎల్‌ఆర్‌ఎస్ అమలు కా కుండా ప్రభుత్వం చర్యలు తీసుకుని పేదలకు న్యా యం చేయాలన్నారు. అలాగే హైడ్రా తీసుకొచ్చి బలహీనవర్గాలకు తీరని కష్టాలు పెడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పేద, మధ్య తరగతి ప్రజలకు అసోసియేషన్ అండగా ఉండి వారి సమస్యలను పరిష్కరిస్తుందన్నారు. ఈ సమావేశంలో కేసర్, యాదమ్మ, చైతన్య, ప్రశాంత్, జీఎస్ ధర్మ పాల్గొన్నారు.

రూ.50 లక్షల నష్టపరిహారం చెల్లించాలి

నాగోలు: భవనం నిర్మాణం సెల్లార్ తవ్వకాల్లో మృతి చెందిన ఒక్కొక్క కార్మిక కుటుంబానికి రూ.50 లక్షల నష్ట పరిహారం చెల్లించాలని ఏఐటీయూసీ రాష్ట్ర కార్యదర్శి ఓరుగంటి యాదయ్య ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కార్మికులకు కనీస భద్రత సౌకర్యాలు కల్పించకపోవడంతో మృత్యువాత పడుతున్నారన్నారు. దీనికి జీహెచ్‌ఎంసీ టౌన్ ప్లానింగ్, లేబర్ అధికారులు బాధ్యత వహించాలన్నారు.

విదేశీ సిగరెట్ల విక్రేత అరెస్టు

చాదర్‌ఘాట్: విదేశీ సిగరెట్లు విక్రయిస్తున్న ఓ వ్యక్తిని అరెస్టు చేసిన ఘటన చాదర్‌ఘాట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ రాజు వివరాల ప్రకారం.. అంబర్‌పేటకు చెందిన యూసుఫ్ (40) ఓల్డ్‌మలక్‌పేట వాహెద్‌నగర్‌లో విదేశీ సిగరెట్ల వ్యాపారం కొనసాగిస్తున్నాడు. సమాచారం అందుకున్న పోలీసులు బుధవారం 600 సిగరెట్ డబ్బాలు సీజ్ చేశామన్నారు.

దశలవారీగా సమస్యలకు పరిష్కారం


ఓపెన్ జిమ్‌ను ప్రారంభిస్తున్న సుజాతనాయక్

హస్తినాపురం: డివిజన్‌లో నెలకొన్న సమస్యలను దశలవారీగా పరిష్కరిస్తామని హస్తినాపురం కార్పొరేటర్ బానోతు సుజాతానాయక్ అన్నారు. ద్వారాకానగర్ కాలనీలో రూ.10.50 లక్షలతో ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌ను బుధవారం ఆమె కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ.. ప్రస్తుత కాలంలో ప్రతి ఒక్కరూ వ్యాయామం చేయాలని అందుకోసం ఓపెన్ జిమ్‌లను ఏర్పాటు చేస్తున్నామన్నారు. డివిజన్ పరిధిలో పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా ప్రజలకు మౌలిక వసతులు కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఈ కార్యక్రమంలో శ్రీనివాస్‌రెడ్డి, నర్సింహారెడ్డి, దామోదర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, లక్ష్మారెడ్డి, శేఖర్‌గౌడ్, లక్ష్మయ్య, సత్యనారాయణ, గోపిరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

పెండింగ్ బకాయిలు విడుదల చేయాలి


కేలండర్ ఆవిష్కరిస్తున్న ఎస్‌టీయూ నాయకులు

వనస్థలిపురం: ఉపాధ్యాయుల పెండింగ్ బకాయిలు తక్షణమే విడుదల చేయాలని ఎస్‌టీయూటీఎస్ హయత్‌నగర్ మండల అధ్యక్షుడు కొర్ర భాస్కర్ నాయక్ డిమాండ్ చేశారు. వనస్థలిపురం ఉన్నత పాఠశాలలో బుధవారం ఆయన ఎస్‌టీయూ కేలండర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. వేతన బకాయిల బిల్లులు సంవత్సర కాలం పైబడి పెండింగ్‌లో ఉన్నాయని దాచుకున్న ప్రావిడెంట్ ఫండ్‌లో ఆరోగ్య, వ్యక్తిగత అవసరాల నిమిత్తం పాక్షిక ఉపసంహరణకు దరఖాస్తు చేసుకుంటే సకాలంలో రావడం లేదన్నారు. వైద్య బిల్లులు చెల్లించడంలోనూ జాప్యం చేస్తున్నారని విమర్శించారు. ఆరోగ్య కార్డులు పని చేయడం లేదని, డీఏల మంజూరు లేదని, పీఆర్సీ ఊసే ఎత్తడం లేదని ఆరోపించారు. ఈ కార్యక్రమంలో లక్ష్మీనారాయణ, శ్రీనివాస్‌గౌడ్, రవికుమార్, మల్లేష్, రామలక్ష్మయ్య పాల్గొన్నారు.

చెరువులో దూకి వృద్ధుడి ఆత్మహత్య


నీటిలో తేలియాడుతున్న మృతదేహం

చైతన్యపురి: చెరువులో దూకి ఓ వృద్ధుడు ఆత్మహత్య చేసుకున్న ఘటన సరూర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. పోలీసుల వివరాల ప్రకారం.. చెరువు కట్టపై ఉన్న శ్రీభవాని ఆలయం సమీపంలో నీటిలో మృతదేహం తేలియాడుతున్న విషయాన్ని తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని బయటకు తీయించారు. మృతుడి వయసు సుమారు 60 ఏళ్లు ఉంటాయని అతడి వద్దనున్న ఆధార్ కార్డు పరిశీలించగా పీర్జాదిగూడకు చెందిన నాగమల్ల బాలరాజుగా గుర్తించి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చారు. ఆర్థిక ఇబ్బందులతో ఆత్మహత్యకు పాల్పడి ఉండొచ్చని తెలిపారు.

బీసీల అభ్యున్నతే ప్రభుత్వ లక్ష్యం

మహేశ్వరం: బీసీల అభ్యున్నతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ మెదక్ పార్లమెంట్ ఇన్‌చార్జి నీలం మధు ముదిరాజ్ అన్నారు. బుధవారం మండల పరిధి మన్సాన్‌పల్లిలో ఓ ప్రైవేట్ కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. రాహుల్ గాంధీ స్ఫూర్తితో రాష్ట్రంలో బీసీల కులగణన చేశామని, పదేళ్లపాటు అధికారంలో ఉన్న కేసీఆర్ ప్రభుత్వం అన్ని వర్గాలను, ముఖ్యంగా బీసీలను అణగదొక్కిందని విమర్శించారు. స్థానిక ఎన్నికల్లో 34 శాతంగా ఉన్న బీసీ రిజర్వేషన్లను 23 శాతానికి తగ్గించి, వారికి తీరని అన్యాయం చేసిందని ఆరోపించారు. ఇప్పుడు ఎమ్మెల్సీ కవిత బీసీ రిజర్వేషన్ల కోసం రౌండ్ టేబుల్ సమావేశాలు నిర్వహించడం బీసీ సమాజం గమనిస్తుందని, అధికారంలో ఉన్నప్పుడు తీరని అన్యాయం చేసిన అదే పార్టీ.. ఇప్పుడు అదే అంశంపై పోరాటం చేస్తామనడం సిగ్గుచేటన్నారు. బీఆర్‌ఎస్‌కు బీసీ కులగణపై మాట్లాడే హక్కు లేదన్నారు. ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను అమలు చేస్తున్నామని పేర్కొన్నారు. బీసీల కులగణన, ఎస్సీ వర్గీకరణ అమలు అనేది చారిత్రాత్మకమైందని తెలిపారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

చంపాపేట: చంపాపేట విద్యుత్ సబ్ స్టేషన్ పరిధిలోని సుల్తానాఅల్వా 33/11 కేవీ విద్యుత్ ఫీడర్ మరమ్మతు పనుల కారణంగా సరఫరాలో అంతరాయం ఉంటుందని ఏఈ శ్రీనివాస్ పేర్కొన్నారు. ఉదయం 11 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు చంపాపేట పాతబస్తీ, సుల్తానాఅల్వా, కటకోని కుంట, సాయిరాంనగర్, నేతాజీనగర్ పరిసర కాలనీల్లో విద్యుత్ అంతరాయం ఉంటుందన్నారు.

7, 8 తేదీల్లో ఉచిత వైద్య శిబిరం

వనస్థలిపురం: కాపు, తెలగ, బలిజ, ఒంటరి సంఘం, వనస్థలిపురం ఆధ్వర్యంలో ఈ నెల 7, 8 తేదీల్లో ఎన్జీవోస్ కాలనీలోని కాపు భవనంలో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు తెలిపారు. అన్ని రకాల వైద్య పరీక్షలు నిర్వహించి అవసరమైన వారికి మందులు అందజేస్తారని వెల్లడించారు.

7న ఆంద్ర సాంబమూర్తి జయంతి

వనస్థలిపురం: వనస్థలిపురం ఎన్జీవోస్‌కాలనీలోని శ్రీ గణేష్ దేవాలయం కళా వేదికపై వనస్థలిపురం భక్త సమాజం ఆధ్వర్యంలో ఈ నెల 7న దర్శక విశారద ఆంద్ర సాంబమూర్తి జయంతి నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా శ్రీ రామకృష్ణా నాట్యమండలి వారిచే భక్త చింతామణి సాంఘిక పద్య నాటక ప్రదర్శన ఉంటుందన్నారు.

రైతు బజార్‌లలో కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్, వనస్థలిపురం రైతు బజార్‌లలో కూరగాయల ధరల వివరాలు.. టమాటా రూ.11, వంకాయ రూ.23, బెండ రూ.40, పచ్చిమిర్చి రూ.35, కాకరకాయ రూ.38, బీరకాయ రూ.40, కాలిఫ్లవర్ రూ.18, క్యాబేజీ రూ.11, క్యారెట్ రూ.19, దొండ రూ.35, ఆలుగడ్డ రూ.23, ఉల్లిగడ్డ రూ.34, గోకరకాయ రూ.35, దోసకాయ రూ.19, సొరకాయ రూ09, పొట్లకాయ రూ.18, అరటికాయ రూ.09, చిక్కుడుకాయ రూ.40, చామగడ్డ రూ.40, మునగ రూ.75, చిలుకడ దుంప రూ.55, బీట్‌రూట్ రూ.19, కీర రూ.23, బీన్స్ రూ.40, క్యాప్సికమ్ రూ.38. ఈ ధరలు గురువారం ఉదయం 9 గంటల వరకు వర్తిస్తాయి.

జెడ్సీకి వినతి



వినతిపత్రం ఇస్తున్న లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: ఓపెన్ ప్లాట్లకు టాక్స్‌ను మినహాయించాలని జీఓ 118 ద్వారా డీడ్ ఆఫ్ కన్వీనియన్స్ పొందిన వారందరికీ ఈ మినహాయింపును వర్తింపజేయాలని బీఎస్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అన్నారు. బుధవారం ఆయన జోనల్ కమిషనర్ హేమంత్ కేశవ్ పాటిల్‌ను ఆయా కాలనీల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేశారు. జెడ్సీని కలిసిన వారిలో దామోదర్‌రెడ్డి, మహేందర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి, ప్రదీప్‌రెడ్డి, పెంటారెడ్డి, శ్రీధర్‌రావు, రాంరెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి


పార్కులో పనులు పరిశీలిస్తున్న భాగ్యలక్ష్మి

మలక్‌పేట: అభివృద్ధి పనులను వేగవంతంగా పూర్తి చేయాలని మూసారంబాగ్ కార్పొరేటర్ బొక్క భాగ్యలక్ష్మి మధుసూదన్‌రెడ్డి అన్నారు. డివిజన్ పరిధిలోని ఎస్‌బీహెచ్ ఆఫీసర్స్ కాలనీ పార్కులో కొనసాగుతున్న అభివృద్ధి పనులను బుధవారం ఆమె పరిశీలించి మాట్లాడారు. అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటిస్తూ సకాలంలో పూర్తి చేయాలన్నారు. పచ్చదనంతో ఆహ్లాదరకంగా తీర్చిదిద్దడానికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఈ శరత్, సైట్ ఇంజనీరింగ్ ఏడుకొండలు, మల్లికార్జున్, సంతోష్, పరశురామ్, ఉమేష్, సాయి పాల్గొన్నారు.

ఎమ్మార్పీఎస్ పోరాట ఫలితమే వర్గీకరణ


మందకృష్ణ మాదిగను సన్మానిస్తున్న పాపన్న, దాసురావు

మలక్‌పేట: ఎమ్మార్పీఎస్ పోరాటం ఫలితంతోనే ఎస్సీ వర్గీకరణ సాధ్యమైందని రాష్ట్ర అధ్యక్షుడు మేడి పాపన్న అన్నారు. సీఎం రేవంత్ రెడ్డి ఎస్సీ వర్గీకరణపై అసెంబ్లీలో తీర్మానం చేయడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ బుధవారం ఆయన రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బట్టు దాసురావుతో కలిసి మందకృష్ణ మాదిగను కలిసి సన్మానించారు. ఏబీసీడీ వర్గీకరణకు చట్టబద్ధత కల్పించడం ద్వారా మాదిగల జీవితాల్లో వెలుగు వస్తాయన్నారు.